క్లుప్తంగా

డ్రెయినేజీ సమస్యకు పరిష్కారం



కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు దుర్గాపురంలో గురువారం మురుగు నీటి పారుదలకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇటీవల గన్నవరంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో డ్రెయినేజీ సమస్యపై కాలనీవాసులు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు వినతిపత్రం సమర్పించారు. డ్రెయిన్ పూడుకుపోవడం వల్ల వర్షకాలంలో ముంపు సమస్యను ఎదుర్కొంటున్నట్లుగా కాలనీవాసులు విన్నవించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు హెచ్‌సీఎల్ ప్రహరీ పక్కనే ఉన్న ప్రధాన డ్రెయిన్‌లో పంచాయతీ సిబ్బంది పూడికలు తొలగించారు. తద్వారా మురుగునీటి పారుదలను క్రమబద్ధీకరించడంతో సమస్య పరిష్కారమైనట్లుగా కాలనీవాసులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న కచ్చా డ్రెయిన్ స్థానంలో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో అనధికార నిర్మాణాలపై మున్సిపాలిటీ అధికారులు చర్యలు చేపట్టారు. కానూరు, తాడిగడప గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. అదనపు అంతస్తులు నిర్మాణం చేస్తున్న భవనాల శ్లాబ్‌లకు రంధ్రాలు పెట్టారు. మున్సిపాలిటీ పరిధిలో ప్లాన్‌లకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్ హెచ్చరించారు. బిల్డర్లు చట్ట విరుద్ధ పనులు చేస్తే బ్లాక్ లిస్టులో పెడతామని చెప్పారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలకు అవస్థలు

గన్నవరంరూరల్: మండలంలోని గ్రామాల్లో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఒక వైపు మండే ఎండలు, మరో వైపు విద్యుత్ కోతలతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతుంది. ప్రతి వారం విద్యుత్ లైన్ల మరమ్మతులు చేస్తున్నామని అధికారులు ప్రకటిస్తున్నారు. అయినా ప్రకటనలకు, క్షేత్రస్థాయి పరిస్థితులకు సంబంధం లేదు. నున్న, గన్నవరం, వీరపనేనిగూడెం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో గన్నవరం మండల గ్రామాల్లో ఉన్నాయి. వ్యవసాయానికి సరఫరా చేసే ఉచిత విద్యుత్ నిలిచిపోతే పట్టించుకున్న వారు లేరని రైతులు వాపోతున్నారు. కొద్దిపాటి వర్షం, గాలి వీచినా సరఫరా నిలిపివేస్తున్నారని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

కంకిపాడు: కంకిపాడులో చైన్ స్నాచింగ్ ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన వివరాల ప్రకారం కంకిపాడు పట్టణానికి చెందిన కొట్టే సాయిలీల గురువారం సాయంత్రం 6.30 గంటలకు తన టీవీ రిమోట్‌ని రిపేర్ చేయించుకోవటానికి కంకిపాడు సెంటర్‌కు నడుచుకుంటూ వస్తుండగా ఆయానా కల్యాణ మండపం వద్ద గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి ఆమె మెడలో బంగారు నాన్‌తాడును లాక్కుని పరారయ్యాడు. ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

31న సంగీత విభావరి



పటమట(విజయవాడతూర్పు): మంగళగిరి వద్ద సి.కె కన్వెన్షన్‌లో ఈ నెల 31వ తేదీన ప్రముఖ గాయకుడు హరిచరణ్‌తో సంగీత విభావరి నిర్వహిస్తున్నామని రవి మెలోడీస్ మేనేజింగ్ డైరెక్టర్ రవి కుమార్ మంద తెలిపారు. గురువారం లబ్బీపేటలోని ఓ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను తెలిపారు. బుక్ మై షో లో టికెట్లు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రొడ్యూసర్ వీరా మాట్లాడుతూ రవి మెలోడీస్ టాలెంట్ సింగర్స్ కి ప్లాట్ ఫారం ద్వారా వెలుగులోని తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. సంస్థ ఆర్టిస్ట్ మేనేజర్ మహేష్ మంద మాట్లాడుతూ విజయవాడకు మంచి సంగీత విభావరి రావాలని కోరుకున్నామని, అది ఇప్పుడు సాధ్యమవుతుందని అన్నారు. డ్యాన్సర్ అక్సా ఖాన్ మాట్లాడుతూ విజయవాడలో 31న ఈవెంట్‌ను విజయవంతం చేయాలని కోరారు. బొమ్మినేని ఇన్ ఫ్రాస్ట్రెక్చర్స్ మేనేజింగ్ డైరెక్టర్ నవీన్, హర్షిత డెవలపర్స్ చైర్మన్ పాండు రంగా రావు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు సక్రమంగా జరిగేనా?



పోరంకిలో ఇష్టారాజ్యంగా డ్రెయినేజీ నిర్మాణం పనులు



నిడమానూరు రోడ్డులో అక్రమ నిర్మాణాలు

- ఆక్రమణదారుల చెరలో పోరంకి – నిడమానూరు రోడ్డు
- డ్రెయినేజీ నిర్మాణంలో ఇష్టారాజ్యంగా మలుపులు
- ప్రజలకు తప్పని అవస్థలు

పెనమలూరు: పోరంకి – నిడమానూరు రోడ్డులో అత్యంత సమస్యాత్మకంగా ఉన్న డ్రెయినేజీ నిర్మాణం పనులు సక్రమంగా జరుగుతాయా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వర్షపు చినుకు పడితే మునిగి పోతున్న రోడ్డుకు ఇరుపక్కలా డ్రెయినేజీల నిర్మాణం పనులు చేపట్టారు. అయితే మున్సిపాలిటీ అధికారులు ఆక్రమణలు తొలగించి డ్రెయినేజీలు సక్రమంగా నిర్మాణం చేస్తారా లేక తూతూ మంత్రంగా ముగిస్తారా... అనే అనుమానాలు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే పోరంకి – నిడమానూరు రోడ్డు నిత్యం ప్రయాణికుల రద్దీతో ఉంటోంది. ఏలూరు, మచిలీపట్నం జాతీయ రహదారులకు నిడమానూరు – పోరంకి రోడ్డు అనుసంధానంగా ఉంది. అయితే ఈ రహదారి అభివృద్ధికి నోచుకోక పోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

80 అడుగుల రోడ్డు..

సీఆర్డీఏ జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లో ఈ రోడ్డు 80 అడుగులుగా చూపారు. అయితే ఆక్రమణల కారణంగా రోడ్డు 20 అడుగులు కూడా లేదు. పైగా కొద్దిపాటి వర్షానికే రోడ్డుపై మూడడుగుల ఎత్తులో నీరు నిలిచిపోతుంది. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దుకాణాలు, బడ్డీ కొట్లు, అపార్టుమెంట్లు, చిరు వ్యాపారులు రోడ్డును పూర్తిగా ఆక్రమించటంతో డ్రెయినేజీ వ్యవస్థ లేకుండా పోయింది. డ్రెయినేజీల పైనే దుకాణాలు నిర్మించారు. ఓట్ల రాజకీయం కారణంగా ఆక్రమణలు ఇప్పటి వరకు తొలగించలేక పోయారు.

మార్కింగ్‌లో మతలబు

పోరంకి – నిడమానూరు రోడ్డులో తీవ్ర సమస్యగా ఉన్న మురుగు నీరు పారుదలకు డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని పాలకులు ప్రతిపాదనలు చేశారు. రోడ్డుకు ఇరువైపులా వేణుగోపాలస్వామి గుడి వద్ద నుంచి మహాలక్ష్మినగర్ వరకు డ్రెయిన్లు 600 మీటర్లు నిర్మాణం చేయటానికి మున్సిపాలిటీ చర్యలు చేపట్టింది. తొలుత ఒక వైపు డ్రెయినేజీ నిర్మాణానికి రూ.22 లక్షలు మంజూరు చేశారు. రెండో వైపు కూడా రూ.30 లక్షల నిధులు మంజూరు చేస్తామని మున్సిపాలిటీ అధికారులు తెలిపారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఆక్రమణలు తొలగించటానికి మార్కింగ్ ఇచ్చారు. అయితే ఆక్రమణల తొలగింపులో అనుకూలురకు ఒక విధంగా, ఇతరులకు మరో విధంగా మార్కింగ్ చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జీడీపీ ప్లాన్ ప్రకారం 80 అడుగుల రోడ్డు కాకుండా అందుబాటులో ఉన్న స్థలం ప్రకారమే మార్కింగ్ చేసి పనులు చేపట్టారు. డ్రెయినేజీ నిర్మాణం అనేక మలుపులు తిప్పి నిర్మిస్తున్నారు. ఇక్కడ డ్రెయినేజీ నిర్మాణం పనులు పరిశీలిస్తే డొల్లతనం బయటపడుతుందని గ్రామస్తులు తెలుపుతున్నారు.

పక్షపాత వైఖరి వీడాలి..

నిత్యం ట్రాఫిక్‌తో ఉండే పోరంకి – నిడమానూరు రోడ్డు అభివృద్ధి చేయాలని పాలకులను గ్రామస్తులు కోరుతున్నారు. కొన్నేళ్లుగా ఈ రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదని చెబుతున్నారు. ఆక్రమణలు తొలగించి డ్రెయినేజీలు నిర్మాణం సక్రమంగా చేస్తే సమస్య పరిష్కారమవుతుందని గ్రామస్తులు తెలుపుతున్నారు. నేతలు పక్షపాత వైఖరి అవలంబించకుండా అభివృద్ధిపై దృష్టిపెట్టాలని కోరుతున్నారు.

50 శాతం రాయితీపై దాణా పంపిణీ



దాణా అందజేస్తున్న హనుమంతరావు తదితరులు

రామవరప్పాడు: నిడమానూరు పశు వైద్యశాలలో 50 శాతం రాయితీపై దాణా పంపిణీ కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి ఎం.హనుమంతరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ.. పాడి రైతులకు 450 కేజీల 20 శాతం మాంసకృతులు కలిగిన దాణాను విడతల వారీగా 50 శాతం రాయితీపై అందిస్తున్నామన్నారు. పాడి రైతులకు పశు కిసాన్ క్రెడిట్ ద్వారా రూ.1.60 లక్షలు ఎటువంటి హామీ లేకుండా బ్యాంకు ఋణం పొందవచ్చునని తెలిపారు. తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లిస్తే 3 శాతం వడ్డీ తిరిగి పాడి రైతు అకౌంట్‌లో జమ చేస్తారన్నారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డుకు సమీప రైతు సేవ కేంద్రం లేదా పశు వైద్యశాలలో దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. జొన్నరకం పశుగ్రాస విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా రాబోయే కాలంలో పశువుల షెడ్లు నిర్మించుటకు, బహువార్షిక పశుగ్రాస క్షేత్రాలు సాగు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ రమేష్, పశు వైద్యాధికారి కె.సతీష్ కుమార్, ఎల్ఎస్ఏ శ్రావణి దీప్తి, ఎంపీటీసీ సభ్యులు రవికాంత్, పాడి రైతులు పాల్గొన్నారు.

వైభవంగా మహాసంప్రోక్షణ పూజలు ప్రారంభం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నున్న(విజయవాడరూరల్): నున్నలోని శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో అష్టబంధన, మహా సంప్రోక్షణ, కుంభాభిషేక వేడుకలు అత్యంత వైభవోపేతంగా గురువారం ప్రారంభమయ్యాయి. వేణుగోపాలస్వామి ఆలయ ప్రధాన అర్చకులు రొంపిచర్ల అప్పలాచార్యులు(గోపాలం), రొంపిచర్ల శేషాచార్యుల పర్యవేక్షణలో అర్చకస్వామి రొంపిచర్ల దత్త కుమార్ ఆధ్వర్యంలో అష్టబంధన మహా సంప్రోక్షణ కుంభాభిషేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఐదు రోజులపాటు నిర్వహించే కుంభాభిషేక వేడుకలను పురస్కరించుకుని దత్తకుమార్ ఆధ్వర్యంలోని బృందం విఖనస మహర్షికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు, భక్తులు గ్రామ వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు కోలాటం, నృత్య కీర్తనలు, మంగళవాయిద్యాల మధ్య శోభాయాత్ర సాగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాల ఎదుట విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, వాస్తు పూజ, వాస్తు హోమం, అకల్మష హోమం, నీరాజనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం విష్వక్సేన పూజ, రక్షాబంధనం, మృత్యంగ్రహణ అంకురార్పణ, అగ్నిమథనం, హోమాలు, పూజలు జరిగాయి. తొలి రోజు కార్యక్రమాల్లో పలువురు దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు.

20న సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

గన్నవరం: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను ఉపాధి హామీ కూలీలు జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు మల్లంపల్లి ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని అల్లాపురంలో ఉపాధి హామీ కూలీలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక వర్గాలు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం దుర్మార్గమన్నారు. వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను ప్రవేశపెట్టి నిర్బంధంగా అమలు జరపాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరికి పారిశ్రామిక వ్యవసాయ రంగాలను కూడా కార్పొరేట్ కంపెనీల హస్తగతం చేయాలనుకోవడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా అన్ని ట్రేడ్ యూనియన్లు సమ్మెకు పిలుపునిచ్చాయని చెప్పారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సంఘ నాయకులు ఏసుదాసు, కళ్లం రాంబాబు, మిరప నాగేశ్వరరావు, అంతోని తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల సవరణపై నెల రోజుల్లో తుది నిర్ణయం ప్రకటిస్తాం



డీపీవో అరుణకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ ప్రముఖులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మేజర్ పంచాయతీ పరిధిలో ఇంటి పన్నుల పెంపు వివాదంపై పూర్తిస్థాయి విచారణ జరిపి జూన్ 15 నాటికి ఓ కొలిక్కి తెస్తామని డీపీవో జె.అరుణ తెలిపారు. గత పాలకవర్గం హయంలో బాపులపాడు పంచాయతీలో పెంచిన ఇంటి పన్నులు ప్రజలకు భారంగా మారాయని, వీటిని సవరించాలని విజ్ఞప్తులు వెల్లువెత్తిన నేపథ్యంలో డీపీవో గురువారం ఇక్కడకు విచ్చేశారు. బాపులపాడులో మొత్తం 3,061 ఇళ్లు ఉండగా, 2014లో 1,600 ఇళ్లకు 5 శాతంపైబడి పన్ను పెంచారని, మరో 954 గృహ, వాణిజ్య కట్టడాలకు అసహజంగా పన్నులు విధించినట్లుగా ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీంతో డీపీవో అరుణ స్పందిస్తూ తాజా సర్వే నిర్వహించి, ఆ మేరకు ఇంటి పన్నులు రివైజ్ చేస్తామని ప్రతిపాదించారు. కానీ పలువురు గ్రామస్తులు దీనికి అంగీకరించలేదు. దీంతో ఐదు శాతం పైబడి పెంచిన ఇంటి పన్నులను పరిశీలించేందుకు ఆరుగురు సిబ్బందితో ప్రత్యేక బృందం ఏర్పాటు చేస్తున్నట్లుగా ఆమె ప్రకటించారు. వీరంతా జూన్ 15వ తేదీలోపు ఇంటి పన్నుల పెంపుపై పూర్తి స్థాయి విచారణ జరుపుతారని, ఆ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని డీపీవో తెలిపారు. సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ, గ్రామ ప్రముఖులు చలమలశెట్టి రమేష్, వేగుంట వెంకట రామారావు, యలమంచిలి శ్రీరామచంద్రమూర్తి, నూకల రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



వణుకూరులో చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు



ముస్తాబాదలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

పెనమలూరు: వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా వణుకూరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయంలో గురువారం పాఠశాల విద్యార్థులు చిత్రలేఖన పోటీలో పాల్గొని బొమ్మలు వేశారు. అనంతరం తోక కథలు, పుస్తక పఠనం, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శాఖా గ్రంథాలయ అధికారి భారతి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు

గన్నవరంరూరల్: విద్యార్థి జీవితంలో తలదించుకుని చదువుకుంటే జీవితమంతా తలెత్తుకుని బతకవచ్చని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం చెప్పారు. స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా గురువారం విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. పుస్తకాలు చదవటం జీవన విధానం కావాలని, ఆ విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను పుస్తక పఠనం వైపు మళ్లించాలని ఆకాంక్షించారు. సెల్‌ఫోన్ల వల్ల కలిగే అనర్థాలు ఇప్పటికే ప్రజలకు అర్థమైందని చెప్పారు. ఇకపై విద్యార్థులు పుస్తకాలను ప్రేమించాలన్నారు. పాఠకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు జరిగింది. విద్యార్థులకు న్యూస్ పేపర్లు చదవాల్సిన అవసరాన్ని గ్రామ పెద్దలు వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా జరిగే విషయాలను విద్యార్థులు తెలుసుకోవడానికి పేపర్ రీడింగ్ ఉపయోగపడుతుందన్నారు. పలు పాఠశాలల విద్యార్థులు, పాఠకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో పఠనాశక్తి పెంపుదల

కంకిపాడు: పుస్తక పఠనంతో పఠనాశక్తి పెంపొందుతుందని వక్తలు పేర్కొన్నారు. వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా కంకిపాడు గ్రంథాలయంలో పుస్తక పఠనం తద్వారా కలిగే ప్రయోజనాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు ఆటలు పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను ప్రోత్సహించారు. గ్రంథాలయ అధికారి సీహెచ్ రామకృష్ణ, తంబాబత్తుల శేషుబాబు, కె.రాంబాబు పర్యవేక్షించారు. తెన్నేరు శాఖ గ్రంథాలయంలో చిన్నారులకు సృజనాత్మక వస్తువుల తయారీపై శిక్షణ ఇచ్చారు. పలువురు చిన్నారులు అద్భుతమైన వస్తువులను అట్టపెట్టెలు, సీడ్ బాక్సులను వినియోగించి అద్భుతమైన వస్తువులను తయారుచేసి అందరి దృష్టిని ఆకర్షించారు.



పురుషోత్తపట్నంలో చెస్ ఆడుతున్న చిన్నారులు



కంకిపాడు గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



తెన్నేరులో తాము రూపొందించిన చిత్రాలను చూపుతున్న చిన్నారులు

ఆర్థిక సాయం అందజేత



బాధితురాలికి నగదు అందజేస్తున్న నాయకులు ఏసుబాబు, శ్రీకాంత్ తదితరులు

ఉయ్యూరురూరల్: పేదలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి భరోసా చెప్పారు. ఆకునూరు గ్రామంలో గురువారం జరిగిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త, మాజీ వలంటీర్ గురిందపల్లి కార్తీక్ వివాహం ఇటీవల జరిగింది. ఈ సందర్భంగా దేవభక్తుని చక్రవర్తి నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గ్రామ నాయకులు వీరభద్ర ఆంటోనీ కుమారుని వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను చక్రవర్తి ఆశీర్వదించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతి పరులు డొక్కు సోమలత ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై ప్రస్తుతం నివాసంలో వైద్య సేవలు అందుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న దేవభక్తుని చక్రవర్తి పార్టీ గ్రామ నేతల ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న లేకున్నా ప్రజా సంక్షేమమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ముఖ్యమన్నారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు ఎప్పుడు అండదండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏసుబాబు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తనా గానం

విజయవాడ కల్చరల్: శ్రీ వేంకటేశ్వర సంకీర్తనా అకాడమీ(శ్వాస), కంచిరామరోటి పీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు భక్తిగా సాగుతున్నాయి. లబ్బీపేట శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో వర్థమాన సంగీత కళాకారులు మొదలు, సంగీత విద్వాంసుల వరకు అన్నమయ్య సంకీర్తనలను భక్తిగా గానం చేస్తున్నారు. గురువారం నాటి కార్యక్రమంలో జీఎల్ హర్షిత, ఎస్. సాత్విక, ఎం. ప్రమీల, బీవీఎస్ఎస్ కృష్ణ అన్నమయ్య సంకీర్తనలు మధురంగా ఆలపించారు. కార్యక్రమంలో శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ మాగంటి వేణుగోపాల్, కార్యనిర్వాహకుడు సీహెచ్ రామ్మోనరావు, మేనేజర్ శర్మ పాల్గొన్నారు.

లా నేస్తం పథకాన్ని పునరుద్ధరించాలి

విజయవాడలీగల్: జూనియర్ న్యాయవాదులకు ఆసరాగా నిలిచేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన లా నేస్తం పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కృష్ణాజిల్లా బార్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎ.కె.బాషా కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్నా ఇప్పటి వరకు నిధులు మంజూరు చేయకపోవడంతో జూనియర్ న్యాయవాదులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బీబీఏ ప్రధాన కార్యదర్శి కేవీ రంగారావు, ఉపాధ్యక్షుడు పిళ్లా శ్రీనివాసరావు, కోశాధికారి ముద్దాడ సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి జి.వరాహలక్ష్మి, మహిళా కార్యదర్శి కె.అనురాధ, గవర్నింగ్ బాడీ సభ్యులు, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు పోరంకిలో కల్యాణ మహోత్సవం

పెనమలూరు: పోరంకి గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామివారి ఆలయంలో శుక్రవారం స్వామివారికి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. కమిటీ సభ్యులు గురువారం వివరాలు తెలుపుతూ.. ఆలయ 8వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం సుప్రభాతసేవ, నిత్యహోమం, సంతాన ప్రాప్తి కోసం పుత్ర కామేష్టి హోమం జరుగుతుందన్నారు. రాత్రి 7 గంటలకు శ్రీ దేవి భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామివారికి, శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామివార్ల దివ్యకల్యాణ మహోత్సవం కనులపండువగా నిర్వహిస్తామన్నారు. స్వామివారి సన్నిధిలో ఈ నెల 18వ తేదీ ఆదివారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

హనుమజ్జయంతికి జంక్షన్ ముస్తాబు

హనుమజ్జయంతి ఉత్సవాలకు హనుమాన్‌జంక్షన్ ముస్తాబవుతోంది. ఈ నెల 17వ తేదీ నుంచి 22 వరకు ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ప్రధాన కూడలి వద్ద విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల ప్రతిమలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రధాన రహదారులు సైతం విద్యుత్ దీపాలతో అలంకరించటంతో రాత్రివేళల్లో ఉత్సవ శోభతో కళకళలాడుతున్నాయి.

–హనుమాన్‌జంక్షన్‌రూరల్



ఏలూరురోడ్డులో ఉత్సవ మండపం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

ప్రాంగణ ఎంపికలో విద్యార్థులకు ఉద్యోగాలు



నున్న(విజయవాడరూరల్): వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో గురువారం ప్రాంగణ ఎంపికలు జరిగాయి. హైదరాబాద్‌కు చెందిన అనసోల్ కన్సల్టెన్సీ సర్వీసెస్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ ఆఖరి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. సాహితీ నంబూరి, చుక్క ఆదిత్య అనే విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబర్చి రూ.5 లక్షల వార్షిక వేతనానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పరమేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ఎస్.నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ప్రాంగణ ఎంపికలో విద్యార్థులు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. ఈ విజయం మిగిలిన విద్యార్థులకు ప్రేరణగా ఉంటుందని, రాబోయే రోజుల్లో మరిన్ని ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎస్.కీర్తి రెడ్డి, డీన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.